## వర్షాకాల సమస్యల పరిష్కారానికి సహకరించండి

## ఐటిడిఏ పీఓను కలిసిన సర్పంచ్ పూర్ణ

**తొలిసమయం, కొత్తగూడెం, జూన్ 23 :**



రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గిరిజన ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాల కల్పన, అంతర్గత రహదారుల మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదలతో పాటు వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని కోరుతూ లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పెద్దతండా గ్రామ సర్పంచ్ లావుడ్య పూర్ణ భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్య పూర్ణ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం తో పాటు గ్రామ అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు, పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణ మరియు మౌలిక సదుపాయాల కల్పనకు తాను నిరంతరం కృషి చేస్తానని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# ఈజీఎస్ నిధులను పంచాయతీలకు పెట్టకపోవడం ఎమ్మెల్యే పక్షపాత వైఖరికి నిదర్శనం

## - సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ

**తొలి సమయం మహబూబాబాద్ జూన్ 22**

ఎంజిఎన్ఆర్ఇజిఎస్ లో కూలీలు చేసిన పనికి వచ్చిన మొత్తం వేతనాల్లో 40% వరకు సిసి రోడ్లు, కల్వర్టులకు కేటాయించే పథకంలో భాగంగా బయ్యారం మండలానికి రెండు కోట్ల 20 లక్షల నిధులు కేటాయించగా వాటిలో మేజర్ పంచాయతీ అయిన బయ్యారంతో పాటు జగ్గుతండ, నామాలపాడు, కాచనపల్లి తదితర గ్రామపంచాయతీలకు ఒక్క పని కూడా కేటాయించక పోవడం ఎమ్మెల్యే పక్షపాత వైఖరికి నిదర్శనమని సిపిఐ (ఎమ్మెల్) న్యూ డెమోక్రసీ ఆరోపించింది. ఈరోజు సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ప్రతినిధి బృందం ఈ మేరకు బయ్యారం ఎంపీడీవో కు మెమోరాండం సమర్పించింది. తక్షణమే బయ్యారం పంచాయతీతో సహా వివిధ పంచాయతీల్లో చేసిన పనికి సరిపడా మెటీరియల్ కాంపోనెంటు నిధులను ఆయా పంచాయతీలలో సిసి రోడ్లకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు తుడుం వీరభద్రం మాట్లాడుతూ బయ్యారం, జగ్గుతండ లలో రోజుకు 1100 మంది కూలీలు ఈజీఎస్ పనులకు వెళుతుంటారని, వారు చేసిన పనికి సంవత్సరానికి సుమారు కోటి రూపాయలు వేతనాలు వస్తాయని, వాటిలో కనీసం 60 లక్షలకు తగ్గకుండా ఈ పంచాయతీలకు కేటాయించాల్సి ఉంటుందన్నారు. కాగా ఎమ్మెల్యే వీటికి ఒక్క పని కూడా కేటాయించకుండా తమకు ఇష్టమైన పంచాయితీలకు మాత్రమే ఎక్కువ పనులు మళ్ళించారని విమర్శించారు. 100 మంది కూలీలు కూడా ఈజిఎస్ పనులకు వెళ్లని చిన్న పంచాయతీలలో మూడు,నాలుగు పనులను కేటాయించారని, ఇలాంటి పక్షపాత వైఖరి వలన ఎక్కువమందితో ఈజీఎస్ పనులు చేయించిన గ్రామపంచాయతీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులను ఏ ప్రాతిపదికన గ్రామపంచాయతీలకు కేటాయించారో ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ఏకపక్షపాలన సాగిస్తున్నదని, ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వీరభద్రం ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లు ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా కేటాయిస్తున్నారని, ఇప్పుడు ఈజీఎస్ పనులలో కూడా పక్షపాతంతో వ్యవహరిస్తూ ఇష్టమైన ప్రాంతాలకు నిధులు మళ్ళిస్తున్నారని ఆయన అన్నారు. కూలీలతో పనులు చేయించాలని ఒత్తిడి పెట్టే అధికారులు నిధులు కేటాయించే సందర్భంలో ఎందుకు మాట్లాడటం లేదని, పనులు చేసేది ఒకరైతే లాభపడేది మరొకరు అవుతున్నారని ఆయన అన్నారు.



ఎన్ఆర్ఈజీఎస్ మెటీరి యల్ కాంపోనెంట్ నిధుల కేటాయింపులు జరిగిన అన్యా యాన్ని ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సరిచేయాలని, బయ్యారం జగ్గు తండా తో సహా మినహాయించబడిన గ్రామ పంచాయతీలు అన్నిటికీ అక్కడ జరిగిన పనుల ఆధారంగా నిధులు కేటాయించాలని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నేతగాని రాకేష్, ఏపూరి వీరభద్రం, కొదుమూరి నాగేశ్వరరావు, బీరెడ్డి సంగయ్య, రెడ్డిమల్ల విశ్వనాథం, ఊకె శేషు, సాగర్ పాల్గొన్నారు.